క్లుప్తంగా

మిత్రుడికి ఆర్థికసాయం



మానవపాడు: మండల కేంద్రానికి జగ్గుల రాముడు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న జెడ్పీహెచ్ఎస్ 2002 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.25వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో రవికుమార్, మోహన్‌గౌడ్, పీర, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సేవలు ప్రారంభం



రాజోళి: మండల కేంద్రంలో టీఎస్ ఆర్టీసీ కార్గో సేవలు ఆదివారం ప్రారంభమయ్యాయి. గద్వాల డిపో మేనేజర్ శ్రీనివాసులు కార్గో కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ ద్వారా గతంలో ఉన్న ప్రయాణాలతో పాటు ప్రస్తుతం సరుకును కూడా రవాణా చేసేందుకు కార్గోను ఏర్పాటు చేశామని, దాని ద్వారా సొంత ప్రదేశాల నుంచి ఎక్కడికి కావాలన్నా తమ సరుకును చేర్చుకునేందుకు సేవలందిస్తుందన్నారు. అందరికి అందుబాటులో ఉండే చార్జీలు, నమ్మకమైన రవాణా అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో దేవేంద్రగౌడ్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయండి

అయిజ: ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు పట్టణంలోని పాత బస్టాండ్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపడుతున్నట్లు మండల అధ్యక్షుడు జయన్న ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ధర్నా చేపడతామని, మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

త్రైత సిద్ధాంత గ్రంథాల అందజేత



కేటీదొడ్డి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక విషయాలపై అవగాహన పెంచుకోవాలని, త్రైత సిద్ధాంత గ్రంథాలను చదవాలని ప్రబోధ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు తాన్యనాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ఆచార్య ప్రబోధనంద యోగీశ్వరుల గ్రంథాల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలు చదవడంతో అనేక సందేహాలకు సమాధానాలు దొరుకుతాయన్నారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, చిట్టెమ్మ, కొండయ్య, రాములు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు రెండు ఎద్దులు మృతి

కేటీదొడ్డి: మండలంలోని ఇర్కిచేడు చెందిన ఉరుకుందమ్మ వ్యవసాయపొలంలో ఎద్దును కట్టేసి ఇంటికి వచ్చారు. ఆదివారం సాయంత్రం మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఎద్దుపై పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని బాధితులు తెలిపారు.

గట్టు: మండలంలోని ఆలూరులో ఆదివారం సాయంత్రం పిడుగు పాటుకు ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన దొడ్డి కర్రెప్పకు చెందిన ఎద్దులు వ్యవసాయ పొలం వద్ద చెట్టు కింది కట్టి వేశారు. సాయంత్రం వర్షం కురుస్తున్న సమయంలో పొలం పని చేస్తున్న వారు సమీపంలోని గుడిసెలోకి చేరుకున్నారు. ఇదే క్రమంలో పిడుగు పడడంతో ఎద్దు మృతి చెందింది. ఎద్దు విలువ సుమారుగా రూ.40 వేలు విలువ ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

విద్యుదాఘాతానికి గురై..

ధరూరు: విద్యుదాఘాతానికి గురై రెండు పాడి గేదెలు మృతి చెందిన సంఘటన మండలంలోని రేవులపల్లి శివారులో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గడ్డల కురుమ్మయ్య ఎప్పటి లాగే ఆదివారం పాడి గేదెలను మేత మేపేందుకు పెద్ద చింతరేవుల ఆలయం సమీపంలోకి తీసుకెళ్లాడు. గాలి వానకు నేలకొరిగిన విద్యుత్ తీగలను రెండు గేదెలు తగిలో అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన గేదెల విలువ రూ.1.50లక్షలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.



కల్వర్టులు నిర్మించేదెప్పుడో?

- వానాకాలంలో వాగులు పొంగిపొర్లే అవకాశం
- రవాణా వ్యవస్థకు అంతరాయం
- కల్వర్టులు నిర్మించాలని కోరుతున్న ప్రయాణికులు



జూలెకల్ స్టేజి-జూలెకల్ మధ్యలో ప్రమాదభరితంగా ఉన్న వాగు

శాంతినగర్: మారుమూల గ్రామాల్లోని వాగులపై కల్వర్టులు నిర్మించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వానాకాలం వచ్చిందంటే వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు వెళ్లడానికి వాగులు ఆటంకంగా మారుతున్నాయి. అలంపూర్ నియోజకవర్గంలోని వడ్డేపల్లి, రాజోళి, అయిజ, మానవపాడు, ఉండవెల్లి, అలంపూర్, ఇటిక్యాల మండలాల్లోని మారుమూల గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల్లోని వాగులపై ఇప్పటివరకు కల్వర్టుల నిర్మాణం చేపట్టలేదు. లోతైన వాగుల్లో వాహనాలు వాగు ఉధృతి తగ్గే వరకు అలాగే ఉండాల్సిన పరిస్థితులు ఉంటాయి.

- వడ్డేపల్లి మండలంలోని జూలెకల్, జక్కిరెడ్డిపల్లి, రామాపురం, కొంకల, కోయిల్‌దిన్నె సమీపంలోని వాగులపై వంతెనలు నిర్మించలేదు. దీంతో భారీ వర్షాలు కురిస్తే ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి.
- రాజోళి మండలంలో ముండ్లదిన్నె సమీపంలోని వాగు, మాన్‌దొడ్డి-తుమ్మిళ్ల, తుమ్మిళ్ల-గార్లపాడు మధ్యలోని వాగులపై వంతెనలు నిర్మించలేదు.
- మానవపాడు మండల పరిధిలోని మానవపాడు-అమరవాయి, మానవపాడు-గోకులపాడు, చెన్నిపాడు-మానవపాడు గ్రామాలకు వెళ్లే రహదారుల్లోని వాగులను వర్షాకాలంలో దాటలేక ప్రయాణికులు ఇబ్బందులు పడతారు.
- ఉండవెల్లి మండలంలో ప్రాగటూరు-మారమునుగాల, ఉండవెల్లి-చిన్నఆముదాలపాడు, బైరాపురం-బస్వాపురం మధ్య ఉన్న వాగులపై ప్రయాణం నరకంగా మారుతుంది.
- అలంపూర్ మండలంలో అలంపూర్-కాశిపురం, అలంపూర్-గుందిమల్ల, అలంపూర్-బుక్కాపురం, భీమవరం-బుక్కాపురం రహదారుల్లో వాగులపై కల్వర్టులు నిర్మించలేదు. దీంతో వానాకాలంలో ప్రయాణికులు వాగులు దాటలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు.
- అయిజ మండలంలో గుడిదొడ్డి-యాపదిన్నె, అయిజ-జడిదొడ్డి, అయిజ-చిన్నతాండ్రపాడు, ఉత్తనూరు-తుపత్రాల, ఉత్తనూరు-మూగోనిపల్లి, భూంపురం-తొత్తినోన్‌దొడ్డి, తుపత్రాల-మేడికొండ మధ్య ఉన్న వాగులపై వంతెనలు నిర్మించకపోవడంతో వానాకాలంలో గ్రామాల ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వాగు దాటాల్సిందే..



శాంతినగర్‌కు వానాకాలంలో వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉంటుంది. జూలెకల్ సమీపంలో పెద్దవాగు దాటి వెళ్లాల్సి ఉంటుంది. లోతైన వాగు ప్రమాదకరంగా ప్రవహిస్తు రాకపోకలకు అంతరాయం కలిగిస్తుంది. విత్తనాలు, ఎరువులు తెచ్చుకోలేని పరిస్థితి మాది. మండలానికి వెళ్లాలన్నా వీలు కాదు. కల్వర్టు నిర్మించి ఇబ్బందులు లేకుండా చూడాలి.

– గోవర్ధన్‌గౌడ్, జక్కిరెడ్డిపల్లి, వడ్డేపల్లి మండలం

రెండు కల్వర్టులు మంజూరు

ప్రయాణానికి ఇబ్బందికరంగా ఉన్న రెండు వాగులపై కల్వర్టుల నిర్మాణానికి ఇటీవల నిధులు మంజూరయ్యాయి. అయిజ-చిన్నతాండ్రపాడు, ఏ బూడిదపాడు-పైపాడు మధ్య ఉన్న వాగులపై కల్వర్టుల నిర్మాణ పనులు మొదలు పెట్టాము. ఇబ్బందికరంగా ఉన్న వాగులపై కల్వర్టుల నిర్మాణానికి నివేదికలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– ఆంజనేయులు, పంచాయతీరాజ్‌శాఖ డీఈ

కరుణించిన వాన.. నాగలి పట్టిన రైతన్న



ఉండవెల్లిలో కమ్ముకున్న మేఘాలు



కేటీదొడ్డిలో కురుస్తున్న వర్షం



ధరూరులో..

గద్వాల అర్బన్: మండలంలో ప్రజలను తొలకరి జల్లులు పలకరించాయి. కారుమబ్బులు కమ్ముకొని వాతావరణం చల్లబడింది. ఎండల, ఉక్కపోతలతో ఇబ్బందులు పడ్డ ప్రజలు తొలకరి పలకరింపుతో ఉపశమనం లభించింది. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు సాగు పనులు మొదలు పెట్టారు. సాగు సీజన్ ప్రారంభమైనప్పటికి వర్షాలు కురువకపోవడంతో రైతులు ఆందోళన చెందారు.

కేటీదొడ్డి: మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం మధ్యాహ్నం నుంచి మండలంలోని ఓ మోస్తరు నుంచి వర్షం కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఇన్నాళ్లు తీవ్రమైన ఎండలతో ఇబ్బందులు పడ్డ ప్రజలు ఉష్ణోగతలు తగ్గడంతో ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇంకా నేల పూర్తిస్థాయిలో తడవలేదని ఒకటి, రెండు భారీ వర్షాలు కురిస్తే పనులు మొదలుపెడతామని రైతులు పేర్కొంటున్నారు.

ధరూరు: ఎండలు, ఉక్కపోతలతో ఎండాకాలాన్ని తలపిస్తున్న వాతావరణం శనివారం కురిసిన వర్షానికి ఒక్కసారిగా చల్లబడింది. రెండో రోజు ఆదివారం మరోసారి వర్షం దంచి కొట్టింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో వర్షం పడేందుకు వాతావరణంలో మార్పులు వచ్చాయి. ఆదివారం సాయంత్రం మేఘాలు కమ్ముకున్నాయి. ఒక్కసారిగా నల్లటి మబ్బులతో కూడిన వాతావరణం కనబడడంతో వర్షం పలకరిస్తుందని పత్తి రైతులు ఆనందపడ్డారు.

అలరించిన గానలహరి



గద్వాల: కళాతపస్వి దివంగత కే. విశ్వనాథ్ సినిమాలోని మధుర గీతాలు ఆహూతులను అలరించాయి. కే.విశ్వనాథ్‌ను స్మరించుకుంటూ జ్ఞాపకార్థం ఆదివారం రాత్రి స్థానిక బాలభవన్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన 'అందెలరవమిది పదములదా' పేరుతో అలనాటి సినీ పాటల ఆర్కెస్ట్రా కార్యక్రమం సాగింది. కార్యక్రమానికి కళాభిమానులు, వ్యాపారులు, పట్టణ ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గాయకులు కాశీనాథ్, శుభ, వేణుగోపాల్, విద్యాధరి, కృష్ణమూర్తి ఆలపించిన పాటలు అలనాటి మధురస్మృతులను గుర్తుకు తెచ్చాయి.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మల్దకల్: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1997–98 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు పాఠశాల అవరణలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి అప్పుడు విద్యాబోధన చేసిన రిటైర్డ్ ఉపాధ్యాయులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయుడు సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదిగినా చదువు చెప్పిన గురువులను మరిచిపోకుండా సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అంతకుముందు లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ప్రమాదకరంగా బ్రిడ్జి



ఉండవెల్లి: మండల కేంద్రానికి వెళ్లే మార్గంలో బ్రిడ్జి దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. జాతీయ రహదారి నుంచి ఉండవెల్లి, కంచుపాడు, చిన్న ఆముదాలపాడు, తక్కశీల, ప్రాగటూరు, శేరుపల్లె, మారమునగాల–1, 2 గ్రామాలకు వెళ్లాలంటే ఈ బ్రిడ్జినే దాటాలి. భారీ వాహనాలు వెళ్తే కూలిపోయే స్థితికి చేరుకుందని వాహనదారులు పేర్కొంటున్నారు. అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

డ్రెయినేజీలు శుభ్రం చేయండి

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్ పట్టణంలోని రాజోళి రహదారిలో డ్రెయినేజీ కంపు కొడుతున్నా అధికారులకు పట్టడం లేదని జమ్ములమడుగు కాలనీవాసులు వాపోతున్నారు. రాజోళి రోడ్డుకు ఇరువైపుల ఉన్న డ్రెయినేజీలో చెత్తాచెదారం పేరుకుపోయిందని, మురుగు నిలిచిపోయి దుర్గంధంతో ముక్కున వేలేసుకుని అటుగా వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపాలిటీ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు స్పందించి కాల్వలు శుభ్రం చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థలో పాఠశాల భవనాలు



మల్దకల్‌లో పైపెచ్చులూడి శిథిలావస్థకు చేరుకున్న తరగతి గది

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థకు చేరుకోవడంతో బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. గదుల కొరత ఉండటంతో చెట్ల కింద, వరండాలు, తాత్కాలిక రేకుల షెడ్లలలో విద్యార్థులు కాలం వెల్లదీయాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలో మొత్తం 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 4 ఉన్నత, 27 ప్రాథమిక పాఠశాలల్లో మొత్తం 6,348 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి సరిపడా గదులు, వసతులు లేక కొందరు విద్యార్థులు మధ్యలోనే బడిమానేసి పొలం బాట పడుతున్నారు. ప్రభుత్వం విద్యను ప్రోత్సహించేందుకు ఓ పక్క చర్యలు తీసుకుంటున్నా.. మరో పక్క పాఠశాలల్లో మౌళిక వసతులు, గదుల కొరతతో గ్రామీణ విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. మల్దకల్, బిజ్వారం, మద్దెలబండ పెద్దతండా, నాగర్‌దొడ్డి, బూడిదపాడు, తాటికుంట, శేషంపల్లి గ్రామాల్లోని పాఠశాల గదులపై పెచ్చులూడి కడ్డీలు తేలడంతో విద్యార్థులు ఎప్పుడు కూలి ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో పాఠశాల గదులపైనుంచి వర్షపునీరు కిందకు రావడంతో పైపెచ్చులు ఊడి కిందపడ్డాయి. అనేకమార్లు విద్యార్థులు ఈ ప్రమాదం నుంచి బయటపడ్డారు. మల్దకల్ జెడ్పీహెచ్ఎస్‌లో 740మంది విద్యార్థులకు గాను 19మంది ఉపాధ్యాయులు ఆంగ్లం, తెలుగు మీడియంలో విద్యాభ్యాసం చేస్తున్నారు. మొత్తం 15సెక్షన్లుగా విభజించినట్లు ప్రధానోపాధ్యాయులు ఇమానియేల్ తెలిపారు. మద్దెలబండ పెద్దతండాలో పాఠశాల గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బదులు పడుతున్నారు. బూడిదపాడు పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో గత్యంతరం లేక వరండాలో విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. శేషంపల్లిలో, తాటికుంటలో అదే పరిస్థితి నెలకొంది.

చర్యలు తీసుకుంటాం



మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్న విషయం తమ దృష్టికి వచ్చింది. ఈ విషయంపై నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తాం. నిధులు మంజూరైన వెంటనే సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తాం.

– కొండారెడ్డి, ఎంఈఓ, మల్దకల్

మౌలిక వసతుల కల్పనకు కృషి



యాక్తాపురంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

ఎర్రవల్లిచౌరస్తా: పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. ఆదివారం ఇటిక్యాల మండలంలోని గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. బీచుపల్లి, యాక్తాపురం, కొండపేట రూ.15లక్షలు, ఎర్రవల్లిలో రూ. 20లక్షలు, కోదండాపురంలో రూ.10లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పనులను నాణ్యతతో చేపట్టి సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ప్రతి గ్రామంలో ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పల్లెప్రకృతి వనాలను, నర్సరీలను, క్రీడా ప్రాంగణాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడం కోసం ట్రాక్టర్లు, డంపింగ్‌యార్డులు, వైకుంఠధామాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి గ్రామానికి అందమైన రోడ్డు వసతి కల్పించేందుకు బీటీ, గ్రామాల్లో అంతర్గత రోడ్లకు సీసీ రోడ్లను ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నర్సమ్మ, జోగుల రవి, ఓటు సుంకన్న, నాయకులు తదితరులు ఉన్నారు.

నాగర్‌కర్నూల్ తరలిన నాయకులు



కేటీదొడ్డి నుంచి సభకు వెళ్తున్న బీజేపీ నాయకులు

రాజోళి: నాగర్‌కర్నూల్‌లో ఆదివారం నిర్వహించిన సభకు మండలం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. అంతకుముందు పలువురు నాయకులు మాట్లాడుతూ.. దేశాభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమవుతుందని, మోదీ పాలనలో ఎన్నో కొత్త చట్టాలు రూపుదిద్దుకుని, ప్రజలకు సమన్యాయం లభించిందన్నారు.

అయిజ: సభకు మండలం నుంచి భారీగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్ ఆధ్వర్యంలో తిరుమలేష్, వినోద్, ఏసు, మల్లేష్, రాజు, రామచంద్ర, రాము తదితరులు వెళ్లారు.

కేటీదొడ్డి: జేపీ నడ్డా పర్యటన సందర్భంగా సభకు ఆదివారం మండల కేంద్రంతో పాటు, పలు గ్రామాల బీజేపీ కార్యకర్తలు గ్రామాల నుంచి తరలి వెళ్లారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహానందిరెడ్డి, ఎర్రభీంరెడ్డి, పద్మారెడ్డి, తిమ్మారెడ్డి, శ్రీపాదరెడ్డి. శ్రీను, అశోక్, గద్వాల కర్రెన్న, దేవేందర్‌రెడ్డి, కర్రెప్ప, తదితరులు పాల్గొన్నారు.

కరిగెట కాదు.. గద్వాల బస్టాండ్



బస్టాండ్‌లో నిలిచిన వర్షపు నీరు

గద్వాల అర్బన్: రెండు రోజులుగా కురుస్తున్న చిన్నపాటి వర్షానికి నీరు నిలిచి బస్టాండు పరిసరాలు అన్ని బురదమయం అయ్యాయి. ప్రయాణికులు బస్టాండులోకి వచ్చేందుకు, బస్సులు ఎక్కేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు అవస్థలు మరింత తీవ్రం. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదాలన్నీ జలమయమయ్యాయి. కృష్ణవేణిచౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, రాజీవ్‌మార్గ్, రెండవ రైల్వేగేటు, చేపల మార్కెట్ తదితర ప్రధాన రహదారుల్లో వర్షాలు నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభంలోనే ఈ పరిస్థితి ఉంటే రానురాను ఏ మేర ఉంటుందో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అరకొర వసతులతో అవస్థలు



ఉండవెల్లిలో భవనాలు లేక పాఠశాలలోనే రెండు అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులు



కలుగోట్లలో రేకుల షెడ్డులో అంగన్‌వాడీ కేంద్రం

- 26 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కరువు

ఉండవెల్లి: మండలంలోని గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఆయా కేంద్రాల్లో వసతులు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో మొత్తం 34 కేంద్రాలు ఉండా, గర్భిణులు 241, బాలింతలు 208, ఏడు నెలల నుంచి 3 ఏళ్లలోపు చిన్నారులు 956, మూడేళ్ల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులు 765 మంది ఉన్నారు. కేవలం 8 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. 26 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా, కొన్ని పాఠశాలలో విలీనమయ్యాయి. అయితే అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటికి ప్రభుత్వం ఇచ్చే అద్దె డబ్బులు ఏ మాత్రం సరిపోవడం లేదు. ప్రభుత్వం నుంచి వచ్చే రూ.వెయ్యికి మిగితా మొత్తాన్ని అంగన్‌వాడీ టీచర్లు కలిపి భవన యజమానులకు చెల్లిస్తున్నారు.

అద్దె పెంచారు..

మండలంలోని అద్దె భవనాల రేట్లను పెంచడంతో ఇబ్బందులు పడుతున్నాం. అద్దె భవనాల్లో సౌకర్యాలు ఉండవు. ప్రభుత్వం నుంచి రూ.వెయ్యి రావడంతో అదనంగా మరో రూ.1500 వరకు కలిపి అద్దె చెల్లిస్తున్నాం. అంతేకాకుండా ఆయ లేకపోవడంతో ఆ పని కూడా మేమే చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

– లక్ష్మి, కలుగోట్ల, అంగన్‌వాడీ టీచర్

ప్రతిపాదనలు పంపించాం

మండలంలో సొంత భవనాలు లేని వాటి వివరాలు ఉన్నతాధికారులకు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే భవనాల నిర్మాణం చేపడుతాం. నిధుల మంజూరుకు సంబంధించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. ఆయ పోస్టులు భర్తీ చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదించాం.

– ఆస్మా, సూపర్‌వైజర్

5న నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు సన్మానం

శాంతినగర్: అలంపూర్ నియోజకవర్గంలోని నాయీబ్రాహ్మణ విద్యార్థులకు జూలై 5న సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఇటీవల పదో తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తిచేసి అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన వారిని శాంతినగర్ పట్టణ నాయీబ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో శాంతినగర్‌లోని డీఎక్స్ఎన్ కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు ఉంటుందని తెలిపారు. మొదటి బహుమతి రూ.3,016, రెండో బహుమతి రూ.2,016, మూడో బహుమతి రూ.1,016 దాతలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.